ప్రజాశక్తి

మంగళవారం 20 మే 2025



బాధితులకు రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని

కంటోన్మెంట్ : విజయనగరం మండలం ద్వార పూడిగ్రామంలో కారు లాక్ పడి మృతి చెందిన నలుగురు చిన్నారుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం మానవతా దృక్పథంతో రూ.25 లక్షలు చొప్పున ఎక్స్ గ్రేషియా అందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ కోరారు. సోమవారం ద్వారపూడి గ్రామంలో బాధిత కుటుంబాలను సిపిఎం నాయకులు తమ్మినేని, రెడ్డి శంకర్రావు పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. బాధితులకు మనోధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాధితులు నిరుపేద కుటుంబాలకు చెందిన వారు కాబట్టి వారికి బతుకు తెరువు భద్రత కల్పించాలని కోరారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయకులు బూర్లి రమణ తదితరులు పాల్గొన్నారు.

రామతీర్థసాగర్ ప్రాజెక్టు పనులు ఇప్పట్లో పూర్తయ్యే అవకాశాలు కనిపించడం లేదు. ప్రభుత్వం మరికొన్నేళ్లు ఇలాగే కాలక్షేపం చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు ప్రత్యామ్నాయ మార్గం ద్వారా నీటి వసతి కల్పిస్తుండడం ఇందుకు నిదర్శనం. నెల్లిమర్ల నియోజకవర్గం లోని నెల్లిమర్ల, భోగాపురం, డెంకాడ, పూసపాటిరేగ మండలాల్లో 24వేల ఎకరాలకు సాగునీరు, విజయనగరం పట్టణానికి తాగునీరు అందించే లక్ష్యంతో సుమారు 20 ఏళ్ల క్రితం తలపెట్టిన రామ తీర్థ సాగర్ ప్రాజెక్టు నేటికీ పూర్తికాలేదు. మారిన ప్రతి ప్రభుత్వమూ అంతకుముందు పనిచేసిన ప్రభుత్వాల్ని విమర్శించుకోవడం తప్ప, ప్రాజెక్టు పూర్తికి చిత్తశుద్ధి ప్రదర్శించడం లేదు. చాలా ఏళ్ల క్రితమే బ్యారేజ్ పనులు 90శాతం పూర్తయినప్పటికీ, మిగిలిన పనులకు తగినంతగా నిధులు కేటాయించకపోవడం వల్ల ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మిగలిపోయాయి. ముఖ్యంగా సుమారు 2.7 టిఎంసిల నీటిని నిల్వ ఉంచే రిజర్వాయర్ మట్టిగట్టు నిర్మాణపనులు 60శాతం మేరకు పూర్తయ్యాయి.

రామతీర్థసాగర్ ఇప్పట్లో పూర్తి కానట్టే?

- విమానాశ్రయానికి నేరుగా చంపావతి నుంచే నీరు
- సెకెండ్ ఫేజ్ వరకు అంతే సంగతులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

కాలువ నిర్మాణ పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. ప్రాజెక్టు డైవర్షన్ కెనాల్ 60శాతం, సొరంగం పనులు 20 శాతం మాత్రమే జరిగాయి. ఇప్పటికే దశాబ్ధాలు గడిచిపోవడంతో గ్యారేజీ గేట్లు, ఇతర నిర్మాణాలు తుప్పుపట్టిపోయాయి. మిగులు పనులు పూర్తి కావాలంటే రూ.807.55 కోట్లు అవసరం అవసరమౌతాయని అధికారిక నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఫిబ్రవరిలో జరిగిన రాష్ట్ర బడ్జెట్ సమావేశాల సందర్భంగానే టిటిపిఆర్ ఇంజినీరింగ్ అధికారులు ఇదే ప్రతిపాదనలు పంపారు. ఇందులో రూ.506.01 కోట్లు అవసరం కాగా, భూసేకరణకు రూ.127.79కోట్లు, పునరావాస కల్పనకు రూ.173.75 కోట్లు చొప్పున అవసరం కానున్నాయి. బడ్జెట్ సమావేశాల్లో కేటాయించింది కేవలం రూ.68కోట్లు మాత్రమే. దీంతో, ఆయుకట్టుదారుల ఆశలు సన్నగిల్లాయి. అయితే, గత నెల 22న ప్రాజెక్టుల పరిశీలనకు వచ్చిన సాగునీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు రామతీర్థసాగర్ ప్రాజెక్టును పరిశీలించిన విషయం విధితమే. దీన్ని త్వరితగతిన పూర్తి చేస్తామని హడావుడి చేశారు. మరోవైపు 2026 జూన్ నాటికల్లా భోగాపురం ఇంటర్నేషల్ ఎయిర్ పోర్టును పూర్తి చేసి విమాన సర్వీసులు అందుబాటులోకి తెస్తామని ఇటీవల అధికారులు, మంత్రులు తెలిపారు. ఎయిర్‌పోర్టుకు అవసరమైన నీటిని రామతీర్థసాగర్ ద్వారా అందిస్తామని గతంలో ప్రభుత్వం చెప్పిన సంగతి విధితమే. రోజుకు 50లక్షల లీటర్ల నీరు అవసరమౌతుందని కూడా సర్కారు గతంలో చెప్పింది. ఈనేపథ్యంలో ఎయిర్‌పోర్టు నీటి అవసరాల కోసమైనా దీన్ని పూర్తిచేస్తారన్న ఆశలు చిగురించాయి. కానీ, ఫస్ట్ ఫేజ్ పనులు పూర్తయ్యేవరకు 17లక్షల లీటర్ల నీరు సరిపోతుందని, దీన్ని కూడా చంపావతి నీటి బావుల నుంచి నేరుగా అందించాలనే నిర్ణయం చేయడంతో ఆయుకట్టుదారుల ఆశలు మళ్లీ ఆవిరయ్యాయి. ఇందుకు తగ్గట్టే చంపావతిలోని మూల నందిగాం వద్ద ఇప్పటికే ఊటబావులు నిర్మించారు. అక్కడి నుంచి పైప్‌లైన్లు, మోటార్లు కూడా అమరుస్తున్నారు. ఇటువల హడావుడిచేసిన సాగునీటి పారుదల శాఖ మంత్రి రామానాయుడు కూడా ఈ ప్రాజెక్టు విషయమై అదనపు నిధులు గురించి మాట్లాడలేదు. ఈ నేపథ్యంలో సెకండ్ ఫేజ్ వరకు రామతీర్థసాగర్ ప్రాజెక్టు నిర్మాణ పనులకు తగిన నిధులు కేటాయించే పరిస్థితులు కనిపించడం లేదు. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ప్రాజెక్టు నిర్వాసితులకు కూడా ఇప్పట్లో న్యాయం జరిగే అవకాశాలు కనిపించడం లేదు.

కన్నీటి వీడ్కోలు

ముగిసిన చిన్నారుల అంత్యక్రియలు ● శోకసంద్రంలో ద్వారపూడి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

కారులో చిక్కుకొని మరణించిన చిన్నారులకు ద్వారపూడి గ్రామస్తులు కన్నీటి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా గ్రామమంతా తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. ఎవరిని చూసినా, ఎవరు మాట్లాడినా చెమర్చిన కళ్లతో, గద్గద స్వరంతో దు:ఖసాగరంలో మునిగిపోయారు. చిన్నారుల తల్లిదండ్రుల ఆవేదన చూపరులను కంటతడి పెట్టించింది.

విజయనగరం మండలంలోని ద్వారపూడి గ్రామంలో కారు లాక్ పడి అందులో చిక్కుకొని మృతి చెందిన నలుగురు చిన్నారులకు సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. విజయనగరం రూరల్ ఎస్ఐ వి.అశోక్ కుమార్ ఆధ్వర్యంలో చిన్నారుల మృతదేహాలకు శవ పంచనామా చేసి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం నాలుగు మృతదేహాలను ద్వారపూడి గ్రామానికి తరలించారు. బంధువులు చూడటానికి కొంత సమయంపాటు ఉంచిన అనంతరం శ్మశానవాటికకు తరలించారు. నలుగురి భౌతికకాయాలను పక్కపక్కనే గోతులు తీసి, పూడ్చిపెట్టి, అంత్యక్రియలు నిర్వహించారు. ఆ సమయంలో ద్వారపూడి గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు. ద్వారపూడి బిసి కాలనీ యువత డిజె, మందుగుండు సామగ్రిని ఏర్పాటుచేసి, చిన్నారులకు కడసారి వీడ్కోలు పలికారు. బాధిత కుటుంబ సభ్యులను మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి, తూర్పుకాపు కార్పొరేషన్ చైర్‌పర్సన్ పాలవలస యశస్విని పరామర్శించారు.

చిన్నారులకు అంత్యక్రియలు నిర్వహిస్తున్న కుటుంబసభ్యులు, గ్రామస్తులు



చిన్నారుల కుటుంబాలను పరామర్శిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని, నాయకులు శంకర్రావు

జెడ్‌పి చైర్మన్ పరామర్శ

విజయనగరం టౌన్ : విజయనగరం మండలం ద్వారంపూడి గ్రామంలో కారు లాక్ డోర్ పడి మృతి చెందిన చిన్నారుల కుటుంబాలను జెడ్‌పిచైర్మన్, వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు సోమవారం పరామర్శించారు. ఈ ఘటన తీవ్రంగా తలచివేసిందని అన్నారు. చనిపోయిన పిల్లలు కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

సుందరయ్య స్ఫూర్తిని కొనసాగిద్దాం

సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని ● పలుచోట్ల సుందరయ్య వర్ధంతి కార్యక్రమాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కమ్యూనిస్టు పార్టీ అగ్రనేత పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తిని కొనసాగించేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ పిలుపునిచ్చారు. సోమవారం పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా స్తానిక ఎల్‌బిజి భవనంలో ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కార్యాలయంపై పార్టీ జెండాను ఎగురవేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సుందరయ్య జీవితం త్యాగాలు మయమన్నారు. ఆయన వ్యక్తిత్వం, అంకిత భావం అందరికీ ఆదర్శమన్నారు. పార్లమెంట్లో ఆయనకొక ప్రత్యేక స్థానం ఉందన్నారు. నెహ్రూ లాంటి నాయకులు ఆయనను ఆదర్శంగా తీసుకున్న పరిస్తితి ఉందన్నారు. నేటి పరిస్థితుల్లో ఆయన సేవలు మనం గుర్తు చేసుకోవడం ఎంతో అవసరమన్నారు. ఈ సమాజంలో పెట్టుబడిదారి విధానం సరికాదు సమ సమాజ స్థాపన ధ్యేయమని కషి చేసిన వ్యక్తి సుందరయ్య అన్నారు. నేడు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తమకు ప్రత్యామ్నాయం కమ్యూనిస్టులని చెప్పారంటే ఆది కమ్యూనిస్టులకు పోరాట చరిత్ర ఉందో అర్థం చేసుకోవాలన్నారు. సుందరయ్య ఏదైతే లక్ష్యంతో పని చేశారో దానిని ముందుకు తీసుకు వెళ్లడం అందరి కర్తవ్యమన్నారు. అనంతరం సీనియర్ సిఐటియు నాయకులు ఎం.శ్రీనివాస మాట్లాడుతూ నేడు దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా పాలన సాగుతోందని అన్నారు. మన దేశంలో విదేశాంగ విధానంలో సామ్రాజ్య వాదులకు లొంగిపోయిన పరిస్తితి నేడు ఉందన్నారు. సుందరయ్య లక్ష్యంతో మెరుగైన సమాజం కోసం,సమ సమాజ స్థాపన కోసం కృషి చేయాలని కోరారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకర్రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆనంద్, లక్ష్మీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, పార్టీ శ్రేణులు

రామకృష్ణ నగర్‌లో..

రామకృష్ణ నగర్‌లో సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు పార్టీ జెండాను ఎగురవేశారు. ఎల్‌బిజి నగర్‌లో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి. రమణమ్మ, తోట పాలెం ముచ్చువాణి చెరువు గట్టుపై సిపిఎం సీనియర్ నాయకులు ఎం.శ్రీనివాస, జెండాలు ఎగురవేశారు. గురజాడ నగర్, సుందరయ్య కాలనీ, వినాయక నగర్‌లో కూడా సిపిఎం జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి. రమణ, ఆనంద్, వి. లక్ష్మి , వెంకటేష్. జగదాంబ, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్మన్‌గా శరత్ ఎన్నిక

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి మున్సిపల్ చైర్మన్'గా ఎనిమిదో వార్డు కౌన్సిలర్ రాంబార్కి శరత్‌బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్లో సోమవారం ఎన్నికల అధికారి రామ్మోహనరావు సమక్షంలో చైర్మన్ ఎన్నిక నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ ఎన్నిక ప్రక్రియను పరిశీలించారు. చైర్మన్‌గా శరత్‌ను మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ గెంబలి శ్రీనివాసరావు ప్రతిపాదించారు. వైసిపి అసమ్మతి కౌన్సిలర్ కె.రామారావు బలపరిచారు. దీంతో చైర్మన్‌గా శరత్ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. చైర్మన్‌గా ఎన్నికైనట్లు ధ్రువపత్రాన్ని శరత్‌కు ఎన్నికల అధికారి రామ్మోహనరావు, కమిషనర్ రామలక్ష్మి అందించారు. శరత్‌ను ఎమ్మెల్యే బేబినాయన, మాజీమంత్రి సుజయకృష్ణ రంగారావు, బుడా చైర్మన్ తెంటు రాజా అభినందించి, శుభాకాంక్షలు చెప్పారు.

చైర్మన్‌గా ఎన్నికైన రాంబార్కి శరత్‌కు ధ్రువపత్రాన్ని అందజేస్తున్న ఎన్నికల అధికారి రామ్మోహనరావు

చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన శరత్

మున్సిపల్ చైర్మన్‌గా రాంబార్కి శరత్ బాధ్యతలు స్వీకరించారు. చైర్మన్ ఛాంబర్‌లో కౌన్సిలర్ల సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. చైర్మన్ శరత్‌కు కమిషనర్ రామలక్ష్మి, మున్సిపల్ ఉద్యోగులు, కౌన్సిలర్లు పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

మున్సిపల్ కార్యాలయం వద్ద సంబరాలు

మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని టిడిపి కైవశం చేసుకోవడంతో మున్సిపల్ కార్యాలయం ముందు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. బాణసంచా కాల్చి, తీన్‌మార్ డప్పులతో సంబరాలు నిర్వహించారు.

9 మంది వైసిపి కౌన్సిలర్లు గైర్హాజరు

మున్సిపల్ చైర్మన్ ఎన్నిక సమావేశానికి తొమ్మిది మంది వైసిపి కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. మున్సిపల్ ఎన్నికల్లో 21 వార్డులను వైసిపి కైవశం చేసుకోగా ఒకరు రాజీనామా చేశారు. 20 మంది కౌన్సిలర్లలో 10 మంది టిడిపికి మద్దతు ఇచ్చారు. మిగతా 10 మందిలో వైస్ చైర్‌పర్సన్ చెలికాని మురళి సమావేశానికి హాజరు కాగా తొమ్మిది మంది కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు.

టిడిపి పట్టణ అధ్యక్షులుగా గెంబలి

టిడిపి పట్టణ అధ్యక్షులుగా గెంబలి శ్రీనివాసరావు ఎంపికయ్యారు. ఇప్పటి వరకు పట్టణ అధ్యక్షులుగా ఉన్న రాంబార్కి శరత్ మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నిక కావడంతో మున్సిపల్ ఫ్లోర్ లీడర్‌గా ఉన్న గెంబలి శ్రీనివాసరావును పట్టణ అధ్యక్షులుగా నియమించినట్లు ఎమ్మెల్యే బేబినాయన ప్రకటించారు. పట్టణంలో టిడిపి బలోపేతానికి పని చేస్తానని గెంబలి శ్రీనివాసరావు చెప్పారు.

సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు

కమిటీల్లో మహిళలకు 10 శాతం ప్రాధాన్యత

వైసిపి అనుబంధ విభాగాల సమావేశంలో జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వైసిపి అనుబంధ విభాగాల కమిటీల్లో మహిళలకు 10 శాతం ప్రాధాన్యత ఉండేలా చర్యలు తీసుకోవాలని వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు దిశానిర్దేశం చేశారు. సోమవారం తమ క్యాంపు కార్యాలయంలో మజ్జి శ్రీనివాసరావు అధ్యక్షతన వైసిపి అనుబంధ విభాగాల అధ్యక్షుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంకిత భావంతో పని చేసేవారిని పార్టీ కమిటీలలో నియమించాలని, అన్ని వర్గాలవారికి కమిటీలో ప్రాధాన్యత కల్పించాలని సూచించారు. కమిటీలో కనీసం మహిళలకు 10 శాతం ప్రాధాన్యత కల్పించాలన్నారు.

సమావేశంలో విజయనగరం పార్లమెంట్ ఇంచార్జ్ కెవిజై సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు వర్రి నరసింహమూర్తి, వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు పాల్గొన్నారు.

కోఆప్షన్ సభ్యులుగా షేక్ చిన్నారావు

ప్రజాశక్తి-కొత్తవలస

కొత్తవలస మండల పరిషత్తు కో ఆప్షన్ సభ్యులుగా షేక్ చిన్నారావును ఎన్నుకున్నారు. సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పిఒ కిరణ్ సమక్షంలో కోఆప్షన్ సభ్యుని ఎన్నిక నిర్వహించారు. ఎంపిడిఒ రమణయ్య, జామి ఎంపిడిఒ నీలం అప్పలనాయుడు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. చిన్నారావు ఒక్కరే నామినేషన్ వేయడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు పిఒ ప్రకటించారు. అనంతరం అధికారులు, ఎంపిటిసి సభ్యులు ఆయనను అభినందించారు. కార్యక్రమంలో ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, వైస్ ఎంపిపి కర్రి శ్రీను, గొరపల్లి శివ, ఎంపిటిసిలు లెంక వరహాలు, వెలగల వెంకటరమణ, పరదేశి నాయుడు, పి.లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

తొలి రోజు 64.32 శాతం హాజరు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం అయ్యాయి. జిల్లాలో 21 కేంద్రాల్లో ప్రారంభమైన పరీక్షకు మొత్తం 639 మంది విద్యార్థులకు గాను 411మంది హాజరయ్యారు. 228 మంది గైర్హాజరయ్యారు. తొలిరోజు పరీక్ష ప్రశాంతంగా జరిగిందని డిఇఒ మాణిక్యంనాయుడు తెలిపారు.

చక్కెర పరిశ్రమను మూసే ప్రసక్తే లేదు

చెరకు సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు ప్రణాళిక : కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో సంకిలి చక్కెర కర్మాగారాన్ని మూసివేసే ప్రసక్తే లేదని కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ స్పష్టంచేశారు. రైతులకు మేలు చేయడంతోపాటు ఈ కర్మాగారం నడిచేందుకు అనుగుణంగా జిల్లాలో చెరకు సాగు విస్తీర్ణాన్ని గణనీయంగా పెంచేందుకు ప్రణాళికను సిద్ధం చేయాలని వ్యవసాయ శాఖాధికారిని ఆదేశించారు. జిల్లాలో చెరకు సాగు పరిస్థితి, రైతుకు మేలు చేసే అంశాలు, సంకిలిలోని ప్యారీ చక్కెర కర్మాగారం మనుగడ తదితర అంశాలపై తమ క్యాంపు కార్యాలయంలో సోమవారం సంబంధిత అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. చెరకు సాగు, ఫ్యాక్టరీ క్రషింగ్ తదితర అంశాలను ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని సంకిలి ఏకైక చక్కెర కర్మాగారంలో డిసెంబరులో చెరకు గానుగ ప్రారంభమై, మార్చి వరకు జరుగుతుందని చెప్పారు. ప్రస్తుతం చెరకు సాగును బట్టి సుమారు 2 లక్షల నుంచి 2.5 లక్షల టన్నుల వరకు క్రషింగ్ జరుగుతుందని, ఈ ఏడాది ఫ్యాక్టరీ మనుగడకు ఢోకా లేదని తెలిపారు. గత ఏడాది సీజన్‌లో సుమారు 4 లక్షల టన్నుల క్రషింగ్ జరిగిందని, ఈ ఏడాది సాగు తగ్గడంతో ఫ్యాక్టరీ మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని చెప్పారు. ఫలితంగా చెరకు రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి వస్తుందన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

దీనిని దృష్టిలో పెట్టుకొని చెరకు సాగును గణనీయంగా పెంచాల్సిన అవసరం ఉందని సూచించారు. గత పదేళ్లలో చెరకు సాగుచేసిన రైతులను గుర్తించి, వారిని చైతన్య పరిచి, వచ్చే ఏడాది సీజన్‌కు కనీసం 5 లక్షల టన్నుల చెరకు పండించే విధంగా ప్రణాళికలను రూపొందించాలని చెప్పారు. గతంతో పోలిస్తే చెరకు మద్దతు ధరను ఇటీవల ప్రభుత్వం పెంచిందని తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో చెరకు సాగు, క్రషింగ్ తదితర అంశాలను సైతం అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్, వ్యవసాయశాఖ జెడి విటి రామారావు, ఉద్యానశాఖ డిడి జమదగ్ని, బీమసింగి ఫ్యాక్టరీ ఇన్‌ఛార్జి ఎమ్‌డి వివిఎస్ నాయుడు, బొబ్బిలి డిప్యూటీ కేన్ కమిషనర్ ఎం.సత్యనారాయణ, సంకిలి ఇఐడి ప్యారీ యూనిట్ హెడ్ వెంకటసూర్యం తదితరులు పాల్గొన్నారు.

21న ఘనంగా యోగా దినోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం

ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా జూన్ 21న నిర్వహించనున్న యోగాడే కార్యక్రమాన్ని జిల్లాలో భారీ ఎత్తున నిర్వహించేందుకు తగిన ప్రణాళికను రూపొందించాలని అధికారులను కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. యోగా డే, ఇతర అంశాలపై సోమవారం సాయంత్రం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వివిధ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్, జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ అంబేద్కర్ అధికారులతో మాట్లాడుతూ, విశాఖలో రికార్డు స్థాయిలో జరిగే యోగా డే వేడుకల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పాల్గొంటారని తెలిపారు.

ఈ యోగా డే వేడుకలను జిల్లాలో విజయవంతం చేసేందుకు ఇప్పటినుంచే పకడ్బంధీగా ప్రణాళికను రూపొందించాలని ఆదేశించారు. దీనిలో భాగంగా ఈనెల 21న ప్రారంభ కార్యక్రమాన్ని రాజీవ్ క్రీడా మైదానంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. దీనికోసం జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో కమిటీలను వేయాలని ఆదేశించారు. ముఖ్యంగా పెద్దఎత్తున విద్యార్థులను, రైతులను, యువతను, మహిళలను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని సూచించారు. సమావేశంలో జెసి ఎస్.సేతు మాధవన్, డిఆర్‌డిఎ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి, మెప్మా పీడీ చిట్టిరాజు, డిఎస్‌డిఒ ఎస్.వెంకటేశ్వర్రావు, ఆయుష్ సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బి.వరప్రసాద్, యోగా, నేచురోపతి వైద్యులు డాక్టర్ స్వప్న, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కోలాహలంగా తొలేళ్ల ఉత్సవం

ప్రజాశక్తి- సాలూరు/రూరల్

సాలూరు శ్యామలాంబ పండుగ నేపథ్యంలో సోమవారం నిర్వహించిన తొలేళ్ళ ఉత్సవానికి వేలాది సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. పట్టణంలో ప్రధాన రహదారి కిలోమీటరు మేర జనసందోహంతో కళకళలాడింది. అక్కేనవీధి పెద్దలు పాలజంగిడి, పూజతో బయలుదేరి మిగిలిన అన్ని వీధుల వాసులకు అందజేశారు. అమ్మవారి గద్దె ఉన్న పెదకోమటి పేట వరకు అన్ని వీధుల ప్రజలు కర్రలతో వెళ్ళారు. గద్దె వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్ రింగ్‌లో డబ్బీవీది, గొల్లి వీధి, మెంటాడవీధి వాసులు సాము తిప్పారు. యువరాజు విక్రం చంద్ర సన్యాసిరాజు వచ్చి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మక్కువ బైపాస్ రోడ్డు ల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

నేడు సిరిమానోత్సవం

శ్యామలాంబ ఉత్సవాల్లో ప్రధాన ఘట్టం మంగళవారం సిరిమానోత్సవం నిర్వహిస్తున్నారు. సిరిమానును పూజారి జన్ని నారాయణరావు అధిరోహించనున్నారు. సిరిమానోత్సవాన్ని తిలకించేందుకు పట్టణ జిల్లాతోపాటు ఇతర జిల్లాల నుంచి భారీగా భక్తులు వస్తారని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

సిటియులో ఆదివాసీలకు ప్రాధాన్యతివ్వాలి

ఎస్‌టి కమిషన్ చైర్మన్ డివిజి శంకరరావు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ఆదివాసీ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన సెంట్రల్ ట్రైబల్ యూనివర్శిటీలో ఆదివాసీలకు అధిక ప్రాధాన్యతివ్వాలని రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు కోరారు. ఈ మేరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు లేఖ రాసారు. ట్రైబల్ యూనివర్శిటీలో ఆదివాసీలకు కేటాయించిన సీట్ల శాతం ఇతర యూనివర్శిటీల మాదిరిగానే 7.5శాతం మాత్రమే ఉందనన్నారు. ట్రైబల్ యూనివర్శిటీ ప్రధానంగా ఆదివాసీ అధ్యయనాలు, ఆదివాసీ కేంద్రిత అంశాలు, పరిశోధనల కోసం ఏర్పాటు చేసినందున వారికి మరింత ఎక్కువ సీట్లను రిజర్వ్ చేయాలని ఆకాంక్షించారు. ఆదివాసీ విద్యార్థులు తమ నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు యూనివర్సిటీ తోడ్పడుతుందని తెలిపారు.

21న డిఇఒ కార్యాలయం ముట్టడి

ప్రజాశక్తి-దత్తిరాజేరు

ఈ నెల 21న డిఇఒ కార్యాలయాన్ని ముట్టడిస్తున్నట్లు ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు ప్రకటించారు. సోమవారం దత్తిరాజేరులోని యుటిఎఫ్ కార్యాలయంలో ఉపాధ్యాయ సంఘాల సమావేశం నిర్వహించారు. పాఠశాలల పునర్వ్యవస్థీకరణ, బదిలీలు, ఉద్యోగోన్నతుల్లో అసంబద్ధాలు సరిచేయాలనే డిమాండ్ ముట్టడి కార్యక్రమం చేపడుతున్నట్లు వారు తెలిపారు. మన బడి - మన భవిష్యత్తు నినాదంతో మండలంలో పనిచేస్తున్న ప్రతి ఉపాధ్యాయుడు ముట్టడిలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు రాంప్రసాద్, హరీష్, వి.సత్యనారాయణ, టి.సన్యాసిరావు, పిఆర్‌టియు నాయకులు డి.పరశురాం, ఐ.లక్ష్మణరావు, పీడీ అసోసియేషన్ నాయకులు జి.గురునాయుడు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతినిస్తున్న మారిక గ్రామస్తులు

నోటిఫికేషన్‌ను వెనక్కి తీసుకోండి

అధికారులకు మారిక గ్రామస్తుల వినతి

ప్రజాశక్తి-వేపాడ

అదానీ కంపెనీ కోసం భూసేకరణకు జారీ చేసిన నోటిఫికేషన్‌ను వెంటనే వెనక్కి తీసుకోవాలని సిపిఎం ఆధ్వర్యాన మారిక గిరిజనులు సోమవారం స్థానిక తహశీల్దార్‌కు వినతి అందించారు. గ్రామంలో భూసేకరణ, సామాజిక అధ్యయనం చేయవద్దని వారు డిమాండ్‌చేశారు. గ్రామాన్ని అదానీ కంపెనీకి అప్పగించి, తమను అక్కడి నుంచి వెళ్లగొట్టాలని చూడటం సరికాదని అభ్యంతరం తెలిపారు. మారిక భూములను అప్పగించే ఆలోచనను విరమించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు చల్లా జగన్, కరకవలస సర్పంచ్ పాతబోయిన పెంటమ్మ, పోరాట కమిటీ నాయకులు జాలరి వీర్రాజు, గెమ్మెల అప్పలనాయుడు, గెమ్మెల శ్రీను, కిల్లో అర్జున్, సిందేరి అసు, గెమ్మెల బుజ్జిబాబు, పాతబోయిన దేవుడు, పాలి దేవుడు, శోభన్‌బాబు, రమేష్ దేముడు, తదితరులు పాల్గొన్నారు.

దళిత విద్యార్థి పై దాడి దుర్మార్గం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

తిరుపతిలో దళిత విద్యార్థిపై దాడి చేయడం దుర్మార్గమని జైభీం భారత్ పార్టీ నాయకులు టొంపల నరసయ్య, కనిగిరి శ్రీనివాసరావు ఖండించారు. సోమవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ తిరుపతి జిల్లా చంద్రగిరి సమీపంలో ఇంజనీరింగ్ కళాశాలలో జేమ్స్ అనే విద్యార్థి పై జూనియర్ యస్వంత్ మరికొంత మంది దాడి చేయడం దుర్మార్గమన్నారు. జేమ్స్‌ని కిడ్నాప్ చేయడంతో బాటు నోటిలో గుడ్డలు కుక్కి విచక్షణ రహితంగా మూత్రం తాగించడం హేయమైన చర్యన్నారు. స్వంత్రం వచ్చి 75సంవత్సరాలు గడిచినా దళితులకు స్వతంత్రం రాలేదని, ఎన్ని ప్రభుత్వాలు మారిన దళితులపై దాడులు మాత్రం ఆగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి, హోంమంత్రి వెంటనే స్పందించి దాడికి పాల్పడ్డ వారిపై కఠిన చర్యలు తీసుకొని ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేసి, బాధిత కుటుంబానికి 25లక్షలు ఎక్స్ గ్రేసియా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఎపిజిఇఎ మహాసభలు జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

వచ్చేనెల 5న విజయవాడలో జరిగే ప్రభుత్వ ఉద్యోగుల సంఘం మహాసభలు జయప్రదం చేయాలని ఎపిజిఇఎ నెల్లిమర్ల తాలూకా యూనిట్ ప్రెసిడెంట్ పి. వీరన్న దొర పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సబ్ ట్రెజరీ కార్యాలయం వద్ద మహాసభ వాల్ పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మహా సభలకు ఉద్యోగులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. మహాసభలకు ముఖ్యఅతిథిగా సిఎం చంద్రబాబు హాజరువుతారని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులకు 11 వేతన సంఘం కమిటి నియమించాలని, డిఎ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు జి.చక్రవర్తి, ఉపాధ్యక్షులు పద్మ గౌరీ, లీలా, విజయలక్ష్మి, జాయింట్ సెక్రటరీ వేణు, శ్యామ్ కుమార్ యాదవ్, కృష్ణ వేణి, ట్రెజర్ ఎం.మురళి మోహన్ పాల్గొన్నారు.

శ్యామలాంబ జాతరకు ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

సాలూరు శ్యామలాంబ జాతరకు శృంగవరపుకోట డిపో నుంచి ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ కె.రమేష్ తెలిపారు. ఎస్.కోట డిపో నుంచి ఈ నెల 21వ తేదీ వరకు రోజుకు ఐదు బస్సులు చొప్పున సాలూరుకు నడుపుతున్నామని చెప్పారు. యాత్రికుల రద్దీ ఎక్కువైతే మరిన్ని బస్సులను పెంచే అవకాశం ఉందని తెలిపారు. ఈ సౌకర్యాన్ని యాత్రికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నవధాన్యాల సాగుతో ఉత్తమ ఫలితాలు

ప్రజాశక్తి-రామభద్రపురం

నవ ధాన్యాల సాగుతో రైతులకు ఉత్తమ ఫలితాలు వస్తాయని ప్రకృతి వ్యవసాయ ఎల్‌వన్ సూర్యలక్ష్మి తెలిపారు. మండలంలో రొంపల్లి రైతు సేవా కేంద్రం వద్ద సర్పంచ్ భవిరెడ్డి శంకర్రావు ఆధ్వర్యంలో 18 రకాల విత్తనాలతో నవధాన్యాలు కలిపి సాగు చేసుకొనే విధానాన్ని వివరించారు. భవిరెడ్డి ఈశ్వరరావు, భవిరెడ్డి నారాయణరావు, వెంకట్రావు పాల్గొన్నారు.

వైభవంగా తొలేళ్ల ఉత్సవం

ప్రజాశక్తి-వేపాడ

వల్లంపూడి గ్రామంలో పైడితల్లమ్మ తొలేళ్ల ఉత్సవం సోమవారం వైభవంగా జరిగింది. పూజారిని పురవీధులలో ఊరేగిస్తూ ఘటాలతో ఆలయానికి తరలివెళ్లారు. డప్పు వాయిద్యాలతో మార్మోగింది. గ్రామమంతా పండగ సందడి నెలకొంది. ఈ సందర్భంగా 40 నుంచి 50 అడుగుల పొడవైన ప్రభలు ఏర్పాటు చేశారు. పండగ నేపథ్యంలో అనేక జానపద, సాంస్కృతిక కళా ప్రదర్శనలు ఏర్పాటుచేశారు.

విఆర్‌ఒలతో సమీక్ష

ప్రజాశక్తి-తెర్లాం

స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం నీటి పన్నుల వసూళ్లపై విఆఓర్‌లతో తహశీల్దార్ హేమంత్‌కుమార్ ఆధ్వర్యంలో సమీక్షించారు. గ్రామాల్లో చెరువులు, వాటి విస్తీర్ణం, ఆయకట్టుదారుల సమాచారంపై ఆయన ఆరాతీశారు. మండలంలో రూ.20 లక్షల మేర పన్ను వసూలు చేయాల్సి ఉందన్నారు. మీ పరిధిలో ఎంతమంది, ఎంత మొత్తం జమ చేశారో వివరాలను అందించాలని కోరారు. మిగతా వసూళ్ల కూడా త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఏ సర్టిఫికెట్ జారీ చేసినా.. ఆ మొత్తం రికార్డు రూపంలో జాగ్రత్త చేసుకోవాలని ఆదేశించారు.

పలుచోట్ల సుందరయ్య వర్ధంతి

విజయనగరం : రామకృష్ణానగర్‌లో జెండా ఎగురవేస్తున్న సిపిఎం నాయకులు శంకర్రావు

దక్షిణ భారత దేశంలో కమ్యూనిస్టు పార్టీ వ్యవస్థాపకులు పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి వేడుకలు సోమవారం జిల్లాలో పలుచోట్ల సిపిఎం ఆధ్వర్యాన జరిగాయి. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండాలను ఎగురవేశారు. దేశంలో సిపిఎం అభివృద్ధికి, పేదల అభ్యున్నతికి సుందరయ్య చేసిన కృషి, ఆయన నిరాడంబరత, ఆదర్శ భావాలను ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు గుర్తు చేసుకున్నారు. సుందరయ్య బాటలో నడిచి ఆయన కలలు గన్న సమ సమాజ స్థాపనకు కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. నేటి పరిస్థితుల్లో ఆయన సేవలను గుర్తు చేసుకోవడం ఎంతో అవసరమన్నారు.

కొత్తవలస : సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేస్తున్న గాడి అప్పారావు

బొబ్బిలి : పేదలకు బట్టలు పంపిణీ చేస్తున్న విజయగౌరి, అంగన్వాడీ కార్యకర్త లక్ష్మి

గజపతినగరం : సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

వేపాడ : సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కార్యకర్తలు

అర్జీలు రాసేందుకు సహాయ కేంద్రం

- దళారులను నమ్మి మోసపోవద్దు : కలెక్టర్ బిఆర్ అంబేద్కర్
- పిజిఆర్‌ఎస్ కు 154 వినతులు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజావినతుల పరిష్కార వేదికకు వచ్చే నిరక్షరాస్యులకు అర్జీలను రాయడంలో సహకరించడానికి కలెక్టరేట్ నుండి ఇద్దరు సిబ్బందిని వచ్చే సోమవారం నుండి కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసున్నట్లు కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. నిరక్షరాస్యులు తమ ఆర్జీలను రాయడానికి దళారులను ఆశ్రయిస్తున్నారని, వారు అర్జీదారులను మభ్య పెట్టి వారి నుంచి డబ్బును తీసుకొని ప్రతి వారం కలెక్టరేట్ చుట్టూ తిరిగేలా చేస్తున్నారని తెలిపారు. ఇకపై అర్జీదారులు మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దని, జెరాక్సు కేంద్రాల్లో రాయించవద్దని, కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన సహాయ కేంద్రంలో సంప్రదించాలని కలెక్టర్ తెలిపారు.

కింది స్థాయి లోనే తమ ఆర్జీలను ఇవ్వాలి

అర్జీదారులు తమ సమస్యలను ముందుగా గ్రామ స్థాయి లో, లేదా మండల స్థాయి లేదా డివిజన్ స్థాయి లో పరిష్కారం కాననియెడల మాత్రమే జిల్లా స్థాయి కి రావాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా స్థాయిలో ఇచ్చినా అర్జీని గ్రామ స్థాయి లేదా మండల స్థాయి వారికే పంపిస్తామన్నారు. కావునా సమయం వృథా కాకుండా అర్జీదారులు కింద స్థాయిలో మాత్రమే అర్జీలు ఇవ్వాలని సూచించారు

పిజిఆర్‌ఎస్ కు 154 వినతులు

సోమవారం పిజిఆర్‌ఎస్ కు 154 వినతులు అందాయి. కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ , ఇంచార్జ్ డిఆర్‌ఒమురళి, డిప్యూటీ కలెక్టర్లు వెంకటేశ్వర రావు, నూకరాజు, ప్రమీల గాంధీ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం అర్జీల్లో భూ సమస్యలకు సంబంధించి రెవిన్యూ శాఖకు అత్యధికంగా 116 వినతులు అందాయి.

అన్ని శాఖల అధికారులు హాజరు కావాలి

ప్రతి సోమవారం నిర్వహించే పిజిఆర్‌ఎస్‌కు జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. సెలవు కోసం ఫోన్ లో మెసేజ్ పెట్టె వారికి షో కాజ్ నోటీసు ఇస్తామన్నారు. సెలవు కావలసిన వారు ముందస్తు అనుమతి తీసుకొని వెళ్లాలని సూచించారు. ఇక పై ప్రతి శనివారం సాయంత్రం అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహిస్తామని తెలిపారు.

కమిషనర్ వినతులు స్వీకరణ

విజయనగరంటౌన్ : నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ పల్లి నల్లనయ్య ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వాటి పరిష్కారానికి తగు చొరవ చూపాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజా వినతులను తక్షణమే పరిష్కరించేందుకు అధిక ప్రాధాన్యత నిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఇఇ టి. రాయల్ బాబు పాల్గొన్నారు.

బాధితుల సమస్యలను పరిష్కరించాలి

అదనపు ఎస్‌పి సౌమ్యలత

కంటోన్మెంట్ : బాధితుల సమస్యలను చట్ట పరిధిలో తక్షణం పరిష్కరించాలని అదనపు ఎస్‌పి పి.సౌమ్యలత ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల నుండి 35 ఫిర్యాదులను స్వీకరించారు. సంబంధిత పోలీసు అధికారులతో ఫోనులో మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యలను సంబంధిత అధికాతులకు వివరించారు. సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని, ఫిర్యాదుల పరిష్కారానికి చట్ట పరిధిలో చర్యలు చేపట్టి, న్యాయం చేయాలని ఆదేశించారు. పబ్లిక్ గ్రీవియన్స్ రిడ్రసల్ కార్యక్రమంలో భాగంగా అదనపు ఎస్పీ35 ఫిర్యాదులను స్వీకరించారు. కార్యక్రమంలో ఎస్‌బి సిఐలు ఎ.వి.లీలారావు, ఆర్.వి.ఆర్.కె.చౌదరి, డిసిఆర్‌బి సిఐ బి.సుధాకర్, ఎస్ఐ రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

సభలో పాల్గొన్న ఎమ్మెల్యే లలితకుమారి

టైలరింగ్ శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీనివాస కాలనీలో సామాజిక భవనంలో ఏర్పాటు చేసిన ఉచిత టైలరింగ్ శిక్షణను ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్, మండల అధ్యక్షులు జిఎస్ నాయుడు, మాజీ ఎంపిపి రెడ్డి వెంకన్న, పట్టణ అధ్యక్షులు మల్లేశ్వరరావు, యూనిట్ ఇన్‌ఛార్జి డోకుల అచ్చెంనాయుడు, ఐటిడిపి రాష్ట్ర కార్యదర్శి చక్కా కిరణ్, నియోజకవర్గ అధ్యక్షులు అనకాపల్లి చెల్లయ్య పాల్గొన్నారు.

లక్కవరపుకోట : లక్కవరపుకోటలోని శాఖా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన మహిళల ఉచిత టైలరింగ్ శిక్షణను ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ చొక్కాకుల మల్లు నాయుడు, సర్పంచ్ కెర్రు పార్వతి, మాజీ ఎంపిపి కొల్లి రమణమూర్తి, టిడిపి నాయకులు పుట్టా శ్రీను, జిఎస్ నాయుడు, డోకుల అచ్చెంనాయుడు పాల్గొన్నారు.

జ్యూట్ కార్మికులకు గ్రాట్యుటీ చెల్లించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రిటైర్డు అయిన నెల్లిమర్ల జ్యూట్‌మిల్లు కార్మికులకు గ్రాట్యుటీ చెల్లించాలని, లేబర్ కోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని కోరుతూ సోమవారం గ్రీవెన్సులో కలెక్టర్‌కు వినతి అందజేశారు. గ్రాట్యుటీ విషయంపై లేబర్ కోర్టును ఆశ్రయించగా వెంటనే గ్రాట్యుటీ చెల్లించాలని యాజమాన్యాన్ని ఆదేశించారని తెపారు. అయినా కోర్టు తీర్పును యాజమాన్యం అమలు చేయలేదన్నారు. కలెక్టర్ స్పందించి నెల్లిమర్ల మండల రెవెన్యూ అధికారికి కోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయించాలని ఆదేశించారని, ఆయన నుంచి స్పందన లేదని తెలిపారు. వెంటనే కలెక్టర్ కలుగజేసుకొని గ్రాట్యుటీ చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

భూసమస్యలను పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-తెర్లాం

గ్రామంలో భూసమస్యలను పరిష్కరించాలని డి.గడబవలస సర్పంచ్ జావాన రమేష్ నాయుడు ఆధ్వర్యంలో రైతులు.. సోమవారం స్థానిక తహశీల్దార్ డి.హేమంత్ కుమార్‌కు వినతి పత్రం సమర్పించారు. గతంలో తమ పేరిట ఉన్న డిపట్టా భూములు ఆన్‌లైన్‌లో ఉండేవని, రీ సర్వే తర్వాత ఆ భూములు, తమ పేర్లు రికార్డుల నుంచి తొలగించారని వివరించారు. తమకు ప్రభుత్వ రాయితీలు కూడా రావడం లేదని వాపోయారు. తమ భూములను ఆన్‌లైన్ చేసి, రికార్డులు సరిచేయాలని విజ్ఞప్తిచేశారు. వెంటనే విఆర్ఒ, సర్వేయర్‌కు ఆయన ఆదేశాలు జారీచేశారు.

గోవు హత్యకు పాల్పడిన వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని కుమిలి గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి గోవు హత్య కు పాల్పడిన వ్యక్తిని పూసపాటి రేగ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. కొమరాడ మండలంకంబవలస పంచాయతీ పెల్లిగుడ్డి (కంచరపాడు)కు చెందిన నల్లిమిల్లి చంటి (45) ఉరఫ్ మల్లేష్ ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. మల్లేష్ స్థానిక క్వారీలో జెసిపి ఆపరేటర్ గా పనిచేస్తూ కుమిలి గ్రామంలో నివాసం ఉంటున్నాడు. ఆదివారం రాత్రి సత్యనారాయణ అనే రైతు ఆవు మెడకు ఉరి పెట్టి వికృత శ్రేష్టలకు పాల్పడుతుండగా ఆవు అరుపులకు రైతులు వచ్చారు. నిందితుడిని రైతులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. గత నెలలో కుమిలి గ్రామంలో ఆవు యొక్క రొమ్ములను కోసి మృతికి కారణం కూడా మల్లేషేనని అంటున్నారు. మూగజీవాలను కిరాతకంగా హత్య చేస్తున్న మల్లేష్‌ను కఠినంగా శిక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు. మల్లేష్‌పై కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. పూసపాటిరేగ పోలీసులు తెలిపారు.

ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్, ఎంపి కలిశెట్టి

పేదల ఆశాజ్యోతి ఎన్‌టిఆర్

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

నందమూరి తారకరామారావు పేద బడుగు బలహీన వర్గాల ఆశా జ్యోతి అని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ కొనియాడారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయం జంక్షన్‌లో ఏర్పాటు చేసిన ఎన్‌టిఆర్ నూతన విగ్రహాన్ని సోమవారం శ్రీనివాస్‌తో పాటు ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు ఆవిష్కరించారు. అంతకుముందు టిడిపి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు సంక్షేమ పథకాలు అందరికీ అందుతున్నాయంటే ఎన్‌టిఆర్ చలువేనని అన్నారు. కార్యక్రమంలో పార్లమెంట్ పార్టీ అధ్యక్షులు శ్రీ కిమిడి నాగార్జున, ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణనాయకులు ప్రసాదుల కనకమహాలక్ష్మి, ప్రసాదుల లక్ష్మి వర ప్రసాద్, కనకల మురళీమోహన్, పొగిరి పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు

ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవి, నాయకులు నాగార్జున, బంగార్రాజు తదితరులు

సైనికులకు సంఘీభావ ర్యాలీ

ప్రజాశక్తి-నెల్లిమర్ల

నియోజకవర్గ కేంద్రం నెల్లిమర్లలో ఆపరేషన్ సింధూర్‌లో పాల్గొన్న సైనికులకు మద్దతుగా కూటమి ఆధ్వర్యాన సోమవారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. స్థానిక మిమ్స్ ఆసుపత్రి నుంచి ఎమ్మెల్యే లోకం నాగమాధవి, మార్క్ ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున ఆధ్వర్యంలో ప్రారంభమైన ర్యాలీ మొయిద జంక్షన్ వరకు సాగింది. అనంతరం నాయకులు మాట్లాడుతూ దేశ రక్షణలో సైనికులు త్యాగం మరువలేనిదన్నారు. ప్రజలంతా వారికి మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. అనంతరం మాజీ సైనికులను సత్కరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మహంతి చిన్నం నాయుడు, కంది చంద్రశేఖర్ రావు, పతివాడ అప్పల నారాయణ, పతివాడ తమ్మినాయుడు, బిజెపి నాయకులు బూర్లె శ్రీధర్, మైపాడ ప్రసాద్, జనసేన నాయకులు అంబళ్ల అప్పలనాయుడు, పతివాడ అచ్చం నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

గొల్లలపేటలో దొంగతనం

తులం బంగారం, పది వేల నగదు అపహరణ

ప్రజాశక్తి-కంటోన్మెంట్

విజయనగరం మండలం గొల్లల పేట గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి దొంగతనం జరిగింది. రూరల్ పోలీసుల కథనం ప్రకారం..మండలంలోని గొల్లల పేట గ్రామంలోని ఈగల భాస్కరరావు కుటుంబ సభ్యులు నివాసం ఉంటున్నారు.నెల రోజుల క్రితం గ్రామంలో నూతన గృహ ప్రవేశం చేసారు .గొల్లల పేట సమీపంలో వేరే ఇల్లు ఉండడంతో ఆ ఇంటి నుంచి సామాన్లు కొత్త ఇంటికి తరలిస్తున్నారు. ఆదివారం పాత ఇంటి వద్ద ఉన్నారు. ఈ సమయంలో ఆదివారం అర్ధరాత్రి దొంగలు ఇంటి తాళాలు విరగ్గొట్టి లోపలికి చొరబడ్డారు. ఇంట్లో ఉన్నా అరతులం గొలుసు, అరతులం ఉంగరం రూ.10వేలు నగదు అపహరించారు. భాస్కర రావు ఉదయం ఇంటికి వచ్చి చూసే సరికి తలుపు తాళాలు విరగ్గొట్టి ఉన్నాయి. బాధితుడు విజయనగరం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్. ఐ.వి.అశోక్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

సమ్మె శిబిరంలో కూర్చున్న సిహెచ్‌ఒలు

22వ రోజుకు సిహెచ్‌ఒల సమ్మె

ప్రభుత్వం వెంటనే చర్చలకు పిలవాలని డిమాండ్

ప్రజాశక్తి- కంటోన్మెంట్

ఆయుష్మాన్ భారత్ నిబంధనలు ప్రకారం ఆరేళ్లుపూర్తి చేసుకున్న సిహెచ్‌ఒలను రెగ్యులర్ చేయాలని ఆంధ్రప్రదేశ్ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు కె.మౌనిక, వి.కనక దుర్గ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట కొనసాగుతున్న సిహెచ్‌ఒల సమ్మె శిబిరంలో వారు మాట్లాడారు. సిహెచ్‌ఒల సమస్యలు పరిష్కరించాలని ఇరవై రెండు రోజులుగా మహిళా ఉద్యోగులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోక పోవడం దారుణమన్నారు .ప్రభుత్వం వెంటనే యూనియన్ నాయకులతో చర్చలు ఏర్పాటు చేసి, సిహెచ్‌ఒల సమస్యలు పరిష్కరించడానికి కృషి చేయాలన్నారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23శాతం వేతన సవరణ జరగాలన్నారు. పని ఆధారిత ప్రోత్సాహకాలను క్రమబద్ధీకరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వై.ప్రసాద్, వి.తేజస్విని సిహెచ్‌ఒలు పాల్గొన్నారు.

వీధి విక్రయదారుల సర్వే పూర్తి చేయాలి : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అందరి సమన్వయంతో వీధి విక్రయదారుల గుర్తింపు సర్వే ప్రక్రియ శతశాతం పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య సచివాలయ కార్యదర్శులకు ఆదేశించారు. సోమవారం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్ని సాంకేతిక సమస్యల వలన ఇబ్బందులు తలెత్తుతున్నాయని కార్యదర్శులు సమావేశం దృష్టికి తెచ్చారు. ఈ విషయమై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి సమస్యను పరిష్కరించిందని, ఇక నుంచి ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. సమావేశంలో టిపిఆర్‌ఒ సింహాచలం, సిటీ మిషన్ మేనేజర్ సన్యాసిరావు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ పి.నల్లనయ్య

కాలువలపై నిర్మాణాలు చేపట్టవద్దు

నగరంలోని ప్రధాన కాలువలతో పాటు చిన్న చిన్న కాలువల పైన ఎటువంటి నిర్మాణాలను చేపట్టరాదని కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. ఆయన ఆదేశాలతో ప్రజారోగ్య సిబ్బంది సోమవారం రింగ్ రోడ్డు, జగన్నాథ స్వామి ఆలయం, జమ్ము ప్రాంతాలలో ప్రధాన కాలువలో ఉన్న చెత్తను ప్రక్షాళన చేశారు.

అన్నా క్యాంటీన్ నిర్వహణకు విరాళం

అన్నాక్యాంటీన్లకు విరివిగా విరాళాలు ఇచ్చి అన్నదాతలను ఆదుకునేందుకు ముందుకు రావాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య పిలుపునిచ్చారు. దీంతో మంగళవారం పిల్లా విజయకుమార్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని రూ.10వేలను అన్నాక్యాంటీన్ ట్రస్ట్ కు విరాళంగా అందజేశారు. ఈ చెక్కును పిల్లా విజయ్ కుమార్ తరపున చంటి కమిషనర్ పల్లి నల్లనయ్యకు అందజేశారు.